క్లుప్తంగా

కమ్యూనిటీ మరుగుదొడ్లకు దరఖాస్తులు

ఉయ్యాలవాడ: మండలంలో దేవాలయాలు, మసీదులు, చర్చిలు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్ ఆవరణల్లో మరుగుదొడ్ల నిర్మాణాలను స్వచ్ఛభారత్ కింద నిర్మించనున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సోమవారం తెలిపారు. ఆయా ప్రదేశాల్లో మహిళలు, పురుషులకు వేరువేరుగా మరుగుదొడ్లు నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.3 లక్షలు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. అయితే మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు సొంత స్థలం కలిగి ఉన్న నిర్వాహకులు సచివాలయాలు లేదా మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

పకడ్బందీగా పశుగణన

ఉయ్యాలవాడ: మండలంలో పకడ్బందీగా పశుగణన కార్యక్రమం చేపడుతున్నట్లు పశు వైద్యాధికారిణి నాగశైలజ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. మండల పరిధిలోని 20 గ్రామ పంచాయతీల్లో తమ సిబ్బంది, సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి పశుగణన సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఆవులు, గేదెలు, ఎద్దులు 4,856, గొర్రెలు 5126, మేకలు 3,050, కోళ్లు 8,650 ఉన్నట్లు గుర్తించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం 2025 ఫిబ్రవరి నెలాఖరు వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు



రికార్డులు తనిఖీ చేస్తున్న ఏఓ

గోస్పాడు: ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి స్వప్నికా రెడ్డి హెచ్చరించారు. సోమవారం స్థానిక శ్రీ సాయికృష్ణ ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాన్ని సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు సరిగ్గా లేనందున రూ.64,800 ఎరువులకు సంబంధించి స్టాప్ సేల్స్ ఇచ్చారు. ప్రతిరోజు నోటీసు బోర్డులో స్టాక్ వివరాలను నమోదు చేయాలని, ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు.

పూడిక తొలగదు.. నీరు పారదు



ఆర్.నాగులవరం వద్ద తెలుగుగంగ కాల్వలో పేరుకుపోయిన మట్టి

రుద్రవరం: మండలంలోని పలు గ్రామాల వద్ద తెలుగుగంగ ఉప ప్రధాన కాల్వలు పూడిపోయాయి. ఏపుగా గ్రాసం పెరగడంతో పాటు వ్యర్థాలతో నిండి ఉండడంతో సాగునీరు పారడానికి ఆటంకం ఏర్పడుతోంది. అంతంత మాత్రంగా పారుతోంది. దీంతో ఆయా కాల్వల పరిధిలోని రైతులు సాగు చేసిన వరి, మొక్కజొన్న, జొన్న, మినుము వంటి పంటలకు నీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. కొందరు బోర్ల నీటితో పంటలను కాపాడుకుంటున్నారు. ఈ పరిస్థితి మండలంలోని అప్పనపల్లె, చిన్నకం బలూరు, పేరూరు, రుద్రవరం, ఆర్.నాగులవరం తదితర గ్రామాల పరిధిలోని 18,19,20,21,22 బ్లాక్ తెలుగుగంగ ఉప ప్రధాన కాల్వల్లో నెలకొంది. తెలుగు గంగ అధికారులు స్పందించి కాల్వల్లో పూడిక తొలగించి సాగునీటి సరఫరాకు అడ్డంకులు లేకుండా చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఆర్టీసీ సర్వీసులు కొనసాగించాలని వినతి



స్పందనలో డీటీకి వినతిపత్రం అందజేస్తున్న నారాయణరెడ్డి

ఉయ్యాలవాడ: ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు సర్వీసులు నడిపేలా చర్యలు తీసుకోవాలని పడిగెపాడు గ్రామానికి చెందిన నారాయణరెడ్డి డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో పలు సమస్యలను డీటీ దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వ హయాంలో ప్రయాణికుల సౌకర్యార్థం ఉయ్యాలవాడ మీదుగా తిరుపతి, నంద్యాలకు బస్సు సర్వీసులు ఉండేవని..కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సర్వీసులను పలు కారణాలు చూపి రద్దు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సర్వీసులు కొనసాగించాలని కోరారు.

కలిసిరాని రబీ

- శనగ రైతును ముంచిన తుపాన్లు
- పంటకు తెగుళ్ల దెబ్బ
- ఆందోళనలో అన్నదాతలు

నియోజకవర్గంలో సాగు చేసిన శనగపంట వివరాలు

మండలం	హెక్టార్లు
ఉయ్యాలవాడ	12,148
దొర్నిపాడు	2,761
చాగలమర్రి	1,080
ఆళ్లగడ్డ	985
శిరివెళ్ల	--
రుద్రవరం	102

ఉయ్యాలవాడ: ఈ ఏడాది రబీలో పప్పుశనగ పంట సాగు చేసిన రైతులు కుదేలయ్యారు. అధిక వర్షాలు, తుపాన్లు అన్నదాతలను నిండా ముంచాయి. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో సాధారణ సాగు విస్తీర్ణం 20,755 హెక్టార్లు కాగా ఈ ఏడాది 17,076 హెక్టార్లలో శనగ పంట సాగు చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో అత్యధికంగా ఉయ్యాలవాడ మండలంలో 12,148 హెక్టార్లలో సాగైంది. పంట కాలం 90 నుంచి 95 రోజులు. ఈ ఏడాది నవంబర్ నెల ప్రారంభంలో విత్తనం వేశారు. సాగు ఆరంభం నుంచి అన్నదాతకు వరుస కష్టాలు వెంటాడుతున్నాయి. విత్తనానికి ముందు వర్షాభావం, మొక్క ఎదుగుతున్న తరుణంలో వరుస తుపాన్లతో కురిసిన వర్షాలతో భూమిలో తేమ శాతం పెరగడం, ఆకాశం మేఘావృతం ఉండడంతో పంటకు వేరుకుళ్లు తెగుళ్లు, వైరస్ తెగుళ్లు ఆశించాయి. తెగుళ్లకు క్రిమి సంహారక మందులు పిచికారీ చేసినా లాభం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. మొక్కలు చనిపోతున్నాయని వాపోతున్నారు. పంటకు రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులు, కూలీలు పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 25 వేల వరకు వెచ్చించారు. సన్న, చిన్నకారు రైతులు అప్పులు చేసి సాగు చేశారు. మరికొందరు రైతులు ముందస్తు కౌలు ఎకరాకు రూ. 15 వేలు చెల్లించి పంటలు సాగు చేశారు. పంట దిగుబడులు తగ్గే అవకాశం ఉండడంతో దిగులు చెందుతున్నారు. ప్రభుత్వం ఎలాంటి సహాయం అందడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఉయ్యాలవాడ సమీపంలో సాగు చేసిన పప్పుశనగకు వేరుకుళ్లు, వైరస్ తెగుళ్లు

ప్రభుత్వంపై నమ్మకం లేదు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు ఎలాంటి సహాయం చేయలేదు. గత ప్రభుత్వం పంట బీమాకు ఉచితంగా ప్రీమియం చేయించి నష్టపోయిన రైతుకు ఆర్థిక సహాయం చేసింది. రైతుకు భరోసా కింద ఏటా రూ. 13,500 అందించి ఆదుకుంది. ప్రస్తుత ప్రభుత్వం రైతే ప్రీమియం చెల్లించాలని చెప్పడంతో నేను ప్రీమియం కూడా చెల్లించలేదు. 30 ఎకరాల్లో పప్పుశనగ సాగు చేశాను. 20 ఎకరాలు కౌలుకు తీసుకుని ఎకరాకు రూ. 18 వేలు చెల్లించి పంట సాగు చేశాను. పంటకు తెగుళ్లు ఆశించాయి.

–కామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, రైతు, ఇంజేడు

శనగ రైతును ఆదుకోవాలి



15 ఎకరాల్లో పప్పుశనగ పంట సాగు చేశాను. ఎకరాకు రూ. 22 వేలు పెట్టుబడి పెట్టాను. ప్రస్తుతం పూత దశలో ఉంది. తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పంటకు తెగుళ్లు ఆశించాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలించడం లేదు. పూత రాలిపోయి దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. శనగ రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

–గంగిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, రైతు, పెద్దయమ్మనూరు

రైతులు పంట మార్పిడి చేసుకోవాలి



వ్యవసాయ సబ్ డివిజన్‌లో 30 ఏళ్లపైబడి నల్లరేగడి భూముల్లో ఒకే పంటగా శనగను రైతులు సాగు చేస్తున్నారు. ఖరీఫ్‌లో ఆరు నెలల పాటు భూమిని ఖాళీగా ఉంచుతున్నారు. 90 రోజుల వ్యవధిలో వచ్చే చిరుధాన్యాలు లేదా కొర్ర, మినుము, నువ్వులు, తదితర పంటలు సాగు చేసుకోవాలి. ఇలా పంట మార్పిడి చేస్తే తెగుళ్లు తగ్గుతాయి. దిగుబడులు కూడా పెరుగుతాయి.

–సుధాకర్‌రెడ్డి, వ్యవసాయాధికారి, ఉయ్యాలవాడ

అసభ్యకర ప్రవర్తనకు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్షను ఖరారు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వివరాలు.. పట్టణంలోని హరిజన పేటకు చెందిన కొమ్ము మధు (అలియాస్) గొడ్డలి వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో చింతరుగు వీధిలో దారిలో వెళ్తున్న మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, సైగలు చేస్తుండటంతో స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. జడ్జి విచారణ నిర్వహించి రెండు రోజులు జైలు శిక్ష విధించారని పోలీసులు వివరించారు.

రజకులకు న్యాయం చేయండి

నంద్యాల(అర్బన్): అవుకు మండలం లింగంబోడు గ్రామ పెద్దల పెత్తనంపై విచారణ జరిపి, రజకులకు న్యాయం చేయాలని ఏపీ రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆల్వకొండ మద్దిలేటి కోరారు. గ్రామంలో అనాదిగా రజకులు సాగు చేస్తున్న భూములు ఆక్రమించుకునేందుకు వక్ర మార్గాలు అన్వేషిస్తున్న గ్రామ పెద్దల తీరుపై విచారణ జరపాలని కోరుతూ సోమవారం జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌కు సంఘం నాయకులతో కలి వినతి పత్రం అందజేశారు. రెవెన్యూ, కోర్టు బాధితులకు అనుకూలంగా తీర్పులు ఇచ్చినా గ్రామ పెద్దలు రజకులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. సంఘం ప్రధాన కార్యదర్శి రాము, నాయకులు అంజి, రమేష్ పాల్గొన్నారు.



విద్యుత్ దీపాల అలంకరణలో ఎస్పీజీ చర్చి



క్రీస్తు జననాన్ని గుర్తుచేసేలా ఏర్పాటు చేసిన పశువుల పాక

క్రిస్మస్ కాంతులు

క్రిస్మస్ పండుగకు ఆయా చర్చిలు ముస్తాబయ్యాయి. చాగలమర్రి మండలం ముత్యాలపాడులో 134 ఏళ్ల క్రితం నాటి ఎస్పీజీ చర్చిని వివిధ రకాల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఈ చర్చిని మత బోధకుడు సర్ డెండ్లీ షెఫర్డ్ 134 సంవత్సరాల క్రితం నిర్మించారు. ఆయన మరణానంతరం భౌతిక కాయాన్ని చర్చి ఆవరణలోనే ఖననం చేసి, ఏటా క్రిస్మస్ పండుగకు విద్యుత్తు దీపాలతో అలంకరించి ఆరాధిస్తారు.

–చాగలమర్రి



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

క్రిస్మస్ సంబరాలు



క్రీస్తు జననం నాటికను ప్రదర్శిస్తున్న చిన్నారులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని శ్యాంనగర్‌లో ఉన్న భారతి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో కరస్పాండెంట్ నాగేశ్వరరావు అధ్యక్షతన క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యతిథిగా న్యాయవాది అనిత పాల్గొని క్రిస్మస్ సందేశాన్ని అందించారు. క్రీస్తు జననం నాటిక ప్రదర్శన ఆకట్టుకుంది.

సురేష్‌కు నాట్య గంధర్వ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న డాక్టర్ సురేష్

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యులు డాక్టర్ పల్లంశెట్టి సురేష్‌కు నాట్య గంధర్వ పురస్కారం లభించింది. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆదివారం రాజమండ్రిలోని కళాప్రియ నృత్య కళాక్షేత్రం సంస్థ వ్యవస్థాపకుడు చంద్రశేఖర్, సురేష్ నాట్య కళలను కాపాడటం కోసం చేస్తున్న కృషికి గాను పురస్కారం అందజేసి సన్మానించారని చెప్పారు.



నృత్యం చేస్తున్న కళాకారులు

మల్లన్నకు నృత్యార్చన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై విజయవాడ మైలవరానికి చెందిన ఎం.కనకలక్ష్మి వారి కూచిపూడి నృత్యం అలరించింది. కార్యక్రమంలో మూషికవాహన, గణపతికౌత్వం, శివతాండవం, అఖిలాండేశ్వరి, లింగాష్టకం తదితర గీతాలకు శ్రీవాణి, వైష్ణవి, సహస్ర, సిరి, దివ్య, హాసిని, తన్విత, జ్యోతి, తేజ తదితరులు నృత్యం ప్రదర్శించారు.

మరబోట్ల లైసెన్స్‌లపై విచారణ

కొత్తపల్లి: ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా నదిలో లైసెన్స్‌లు లేకుండా మరబోట్లు నడుపుతున్న విషయంపై సోమవారం ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ అధికారి నాగజ్యోతి విచారణ చేపట్టారు. స్వయంగా సంగమేశ్వరం పరిధిలోని సిద్ధేశ్వరం ఘాట్‌ను ఇరిగేషన్, టూరిజం అధికారులతో పరిశీలించారు. అక్కడ సిద్ధేశ్వరం, జానాల గూడెంల మరబోటు నిర్వాహకులతో మాట్లాడారు.

మాజీ ప్రధానుల సేవలు చిరస్మరణీయం

నంద్యాల(వ్యవసాయం): మాజీ ప్రధానమంత్రులు పీవీ నరసింహరావు, చరణ్‌సింగ్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని నంది రైతు సమాఖ్య గౌరవాధ్యక్షుడు డాక్టర్ రవీంద్రనాథ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో మాజీ ప్రధానుల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పీవీ నరసింహారావు వర్ధంతి, రైతు ఉద్యమ నేత చరణ్‌సింగ్ జయంతి వేడుకలు నిర్వహించుకోవడం అందరి బాధ్యత అన్నారు. ఆర్థిక సంస్కరణలతో భారతదేశానికి మంచి ప్రయోజనాలు అందించిన ప్రధానిగా నరసింహరావు చరిత్రలో నిలిచి పోయారన్నారు. చరణ్‌సింగ్ రైతు ప్రయోజనాల కోసం పోరాడిన వ్యక్తి అన్నారు. ఆయన జయంతిని రైతు దినోత్సవంగా జరుపుకోవడం విశేషమన్నారు. కృష్ణారెడ్డి, కైలాసనాథరెడ్డి, ఓబులపతి, శివారెడ్డి, పుల్లారెడ్డి, రఫీ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నంది రైతు సమాఖ్య సభ్యులు

బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో..

మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి నగరదోన సుధీర్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కేశవమూర్తి, మాధవరావు, రాజశేఖర్, మోహన్, మారుతి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): రైతులకు ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చాలని, మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేస్తామని రైతులకు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఇస్తామని చెప్పిన నరేంద్ర మోదీ చిత్తశుద్ధితో అమలు చేయాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రైతు సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం ఆధ్వర్యంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌కుమార్, రాజశేఖర్, సహాయ కార్యదర్శి రామచంద్రుడు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తోటమద్దులు మాట్లాడుతూ జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని దొడ్డి దారిలో అమలు చేయడం సరికాదన్నారు. రైతులందరినీ జైలు వేయడం నిరంకుశ ప్రభుత్వానికి నిదర్శనమన్నారు. ఢిల్లీకి పాదయాత్ర చేస్తున్న రైతులపై అణిచివేతను ఆపాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శులు లక్ష్మణ్, బాలవెంకట్, పుల్లా నరసింహ, రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు రాంబాబు, మార్క్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధానం ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న, జిల్లా సమితి సభ్యులు సుబ్బారెడ్డి, శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం వ్యవసాయ రైతు నల్లచట్టాల జీవో కాపీలను పట్టణంలోని సంజీవనగర్ సెంటర్‌లో దహనం చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ రాజకుమారికి అందజేశారు. రైతులు, హుసేని, నబిసా, రవికుమార్, దానం దస్తగిరి, రంగయ్య, రమణశేషు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



చిన్నారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న కలెక్టర్

నంద్యాల(న్యూటౌన్): స్థానిక మున్సిపల్ టౌన్ హాల్‌లో సోమవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల మైనార్టీ వెల్ఫేర్ డిపార్టుమెంట్ అధికారి సబిహా పర్వీన్ అధ్యక్షతన కార్యక్రమాన్ని జరిపించారు. ఇందుకు జిల్లా కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, క్రిస్టియన్ జేఏసీ ప్రెసిడెంట్‌లతో పాటు బిషప్‌లు ఇమ్మానియేల్, మణిరాజ్ భాస్కర్, మన్నెం జానయ్య పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని సందేశాన్ని అందించారు. అనంతరం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

రుద్రవరం: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఆధార్ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ.. ఆరేళ్లలోపు చిన్నారులకు కొత్త ఆధార్ కార్డు నమోదు కోసం మండలంలో ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ఈ నెల 26,27,28 తేదీల్లో మందలూరు, ఎర్రగుడిదిన్నె, శ్రీరంగాపురం, కోటకొండ గ్రామాల్లో ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నామని వెల్లడించారు.

దుస్తుల పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని డేనియల్‌పురంలో సీఎస్ఐ చర్చి పాస్టరేట్ చైర్మన్ కాంతరావు గురువుల ఆధ్వర్యంలో పేదలకు దుస్తులను సోమవారం పంపిణీ చేశారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని కఠారీ మధుజీవన్ దంపతులు మున్సిపాలిటీ వర్కర్లు, వితంతువులకు నూతన వస్త్రాలు అందజేశారని చెప్పారు. సీఎస్ఐ సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గోస్పాడు: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని నంద్యాల డీఎస్పీ శ్రీనివాసరెడ్డి అన్నారు. నంద్యాల పట్టణంలోని మధుమణి నర్సింగ్ హోం కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం సైబర్ క్రైం, న్యాయ విభాగం, మెడికల్ నెగ్లిజెన్స్ ప్రికాషన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోకూడదన్నారు. సైబర్ నేరాల్లో ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, ఆన్‌లైన్ ఫ్రాడ్, జాబ్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్, మాట్రీమోని ఫ్రాడ్, ఓటీపీ, కేవైసీ ఫ్రాడ్స్, హనీట్రాప్, ఏపీకే లింక్స్ మోసాలు, క్రెడిట్‌కార్డ్స్ తదితర వాటిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల బారిన పడి మోసపోతే వెంటనే 1930కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు. సైబర్ క్రైంపై ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ మారుతి శంకర్ వివరించారు. డాక్టర్లు రవికృష్ణ, మధుసూదనరావు, జఫరుల్లా పాల్గొన్నారు.



అవగాహన సమావేశంలో పాల్గొన్న వైద్యులు, పోలీసులు

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రైతులను సన్మానిస్తున్న నాయకులు

చాగలమర్రి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు తక్కువ ధరకు ఎరువులు, విత్తనాలు అందించి, పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్ కోరారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జాతీయ రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. 12 మంది రైతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ.. దివంగత మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ జయంతిని పురస్కరించుకుని ఏటా డిసెంబర్ 23వ తేదీ రైతు దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. రైతుల సంక్షేమం కోసం చరణ్‌సింగ్ అనేక కార్యక్రమాలు చేసి భారత దేశపు రైతుల విజేతగా పేరుగడించారని చెప్పారు. లాభనష్టాలను పట్టించుకోకుండా కష్టపడి పంటసాగు చేసి అందరికీ అన్నపెడుతున్న రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ముల్లా రఫీ, ఎంపీటీసీ సభ్యుడు ఫయాజ్, ఉప సర్పంచ్ మహమ్మద్ సోహెల్, పార్టీ నాయకులు ముల్లా ఖాదర్‌బాషా, ముల్లా వలి, షేక్షా, వి.షరీఫ్, అబ్దుల్లా, షబ్బీర్, ఉత్తమ రైతు అవార్డు గ్రహీత మహబూబ్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలు పకడ్బందీగా నిర్వహించాలి



వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాభివృద్ధికి అందించే నిధుల వినియోగంపై నిర్వహించే గ్రామ సభలు పకడ్బందీగా నిర్వహించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుమల్ల రహీం కోరారు. గ్రామ సభల్లో అన్ని శాఖల అధికారులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం డీపీఓ జమీవుల్లాకు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ చట్టం జీఓనెం 791 ప్రకారం ప్రతి సంవత్సరం తప్పనిసరిగా నాలుగు గ్రామ సభలు నిర్వహించాల్సి ఉందన్నారు. గ్రామ సభలకు దండోరా వేయించి ప్రజలంతా హాజరయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు ప్రసన్నకుమారి, కార్యదర్శి సత్యనారాయణ, రహంతుల్లా, శివశంకర్, వాసు, శివనారాయణ పాల్గొన్నారు.